క్లుప్తంగా

ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూపులు

మందమర్రిరూరల్: మందమర్రిలోని ఆసరా పింఛన్ల లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రతినెలా 25వ తేదీలోగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లలో డబ్బులు జమయ్యేవి. జిల్లాలోని మందమర్రి పక్కనున్న రామకృష్ణాపూర్‌లోని లబ్ధిదారులకు ఈనెలకు సంబంధించిన పింఛన్ డబ్బులు జమకాగా మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు మాత్రం ఇంకా జమ కాలేదు. దీంతో లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై డీఆర్‌డీవో కిషన్‌ను వివరణ కోరగా ఒకట్రెండు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిపారు.

పశువుల్లో రోగనిర్ధారణకు పేడ పరీక్షలు

భీమారం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దాంపూర్, ధర్మారం గ్రామాల్లో శుక్రవారం పశువుల్లో రోగ నిర్ధారణ కోసం పేడ పరీక్షలు నిర్వహించారు. ఈమేరకు ఆదిలాబాద్‌లోని రోగనిర్ధారణ కేంద్రం వైద్యులు సతీశ్ పరీక్షలు జరిపారు. కొన్నిరోజులుగా రెండు గ్రామాల్లోని పశువులు విరోచనాల బారిన పడి ఇబ్బంది పడుతున్నట్లు మండల వెటర్నరీ అధికారి డాక్టర్ రాకేశ్ శర్మ తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు పశువులకు రోగ నిర్ధారణ పరీక్షలు జరిపి మందులు అందించామన్నారు.

సమయపాలన పాటించాలి

భీమారం: ప్రజలకు మరింత సేవలు అందేలా రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని సకాలంలో పేదలకు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో పంపిణీ చేయాలని పేర్కొన్నారు. మండలంలో ఏళ్లుగా రేషన్ డీలర్‌గా సేవలందిస్తున్న నరహరి సంతోషిణీని డీలర్లు సన్మానించారు.

ఆరోగ్య సంరక్షణకు ఆయుష్ మందులే మేలు

చెన్నూర్: ఆరోగ్య సంరక్షణకు ఆయుష్ మందులే మేలని ఆయుష్ జిల్లా అధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆయుష్ కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మెడికల్ అధికారి సంసన్ జామత్, సిబ్బంది కిరణ్, శ్రీధర్, ముజఫర్ పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

కాసిపేట: ప్రతీ గ్రామపంచాయతీలో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఓటర్ల జాబితా, మెర్జింగ్ స్టేట్‌మెంట్ తయారుచేసి టీపోల్ ఎంట్రీ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. పారిశుధ్య పనులు, క్లోరినేషన్ నిరంతరం చేపట్టాలని, వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీవో సబ్దర్ అలీ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణంలో జరిగిన ఎన్నికల్లో మండల గౌరవ అధ్యక్షుడిగా రాజన్న, అధ్యక్షుడిగా సొల్లేటి సందేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.రామకృష్ణ, గౌరవ సలహాదారుగా జి.సంజీవ్‌లను ఎన్నుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



రోడ్డు పరిశీలిస్తున్న కమిషనర్ సతీశ్

శ్రీరాంపూర్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని నస్పూర్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో డ్రైడే నిర్వహించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ మేకల దాసుతో కలిసి ఇంటింటికి వెళ్లి కూలర్లు, కుండీలు, పాత టైర్లలో ఉన్న నిల్వ నీటిని తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.అనంతరం స్థానిక వార్డు కౌన్సిలర్ విన్నపం మేరకు వార్డులో ధ్వంసమైన రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. జువాజీ, మల్లేశ్, వెంకన్న, నర్సయ్య, తార, ఉమ, నర్సయ్య పాల్గొన్నారు.

జోరుగా గంజాయి వ్యాపారం

- మహారాష్ట్ర నుంచి తరలింపు
- ఆకర్షితులవుతున్న యువత



గంజాయి విక్రేతల అరెస్ట్ చూపుతున్న పోలీసులు (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలో గంజాయి వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. యువత గంజాయి మత్తులో నిత్యం మునిగితేలుతున్నారు. మారుమూల ప్రాంతాలు, జనసంచారం లేని ప్రదేశాల్లో గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు గంజాయి గుప్పుమంటోంది. సిగరేట్‌లోని పొగాకును తొలగించి గంజాయి నింపుకొని సేవిస్తూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. చైన్ సిస్టంలా గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయి. యువత గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు. గంజాయి సేవించిన మత్తులో బైక్‌లపై విచ్చలవిడిగా తిరుగుతూ పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. బైక్ రేసింగ్‌లు పెట్టుకొని ప్రధాన రహదారుల్లో అతివేగంగా బైక్‌లు నడుపుతూ రోడ్డుప్రమాదాలకు కారణమవుతున్నారు.

మహారాష్ట్ర నుంచి పట్టణానికి..

మహారాష్ట్రలోని బల్లార్షా, చంద్రాపూర్ నుంచి మంచిర్యాల, రామగుండం, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం, రాయపట్నం పలు ప్రదేశాలకు గంజాయి చేరవేస్తున్నారు. కొందరు ఏజెంట్లుగా మారి గంజాయిని కొనుగోలుదారుల వద్దకు తరలిస్తున్నారు. ఎలాంటి పనులు లేని కొందరు యువకులు గంజాయికి అలవాటు పడి బానిసలుగా మారుతున్నారు. ఈనెల 18వ తేదీన మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి వచ్చిన వ్యక్తి పట్టణంలోని వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. గంజాయిని మహారాష్ట్రలో కిలో రూ.10వేలకు కొని రూ. 20వేల వరకు అమ్ముతున్నారు. కొద్ది రోజుల క్రితం కొంతమంది యువకులు గంజాయి తాగి పలువురిని ఇబ్బందులకు గురిచేయడంతో పోలీసులు వారితో పాటు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసులు, షీటీం సిబ్బంది ఎన్నోమార్లు మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోతోంది. అధికారులు దృష్టి సారించి గంజాయి వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. యువత గంజాయికి అలవాటు పడి భవిష్యత్తును కోల్పోవద్దు. గంజాయి వల్ల అనారోగ్యం బారిన పడుతారు. ఇప్పటికే అనేక గంజాయి కేసులు నమోదు చేశాం.

\- నరేందర్, పట్టణ సీఐ, లక్సెట్టిపేట

నేరాల నిర్మూలనకు 'కమ్యూనిటీ కాంటాక్ట్'



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్: నేరాలను నిర్మూలించేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీజోన్ ఆర్‌కే4 గడ్డ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ మట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తవ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుంటే తమకు సమాచారం అందించాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గంజాయి, మద్యం, డ్రగ్స్‌కు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, డయల్ 100 వినియోగించుకోవాలని పేర్కొన్నారు. సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, మందమర్రి ఎస్సై రాజశేఖర్, దేవాపూర్ ఎస్సై అంజనేయులు, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు



జరిమానా విధిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

భీమారం: దుకాణదారులు రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవని డీపీవో వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. శుక్రవారం భీమారంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈమేరకు షాపుల్లోని చెత్తని రోడ్లపై వేసిన ఐదుగురు వ్యాపారులకు జరిమానా విధించారు. అనంతరం వ్యాపారులకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. దుకాణాల్లోని చెత్తని గ్రామపంచాయతీ వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఆయన వెంట ఎంపీవో సతీశ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి ఉన్నారు.

ఆదివాసీ అమరుడు రమేశ్ వర్ధంతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో శుక్రవారం ఆదివాసీ అమరుడు రొడ్డ చిన్న రమేశ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం నాయకులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

వేమనపల్లి: ఎట్టకేలకు సుంపుటం గ్రామానికి వెళ్లిన ట్రాన్స్‌కో సిబ్బంది శుక్రవారం గ్రామ కూడలి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేశారు. 'కరెంట్ పోయిందా కట్టెతో కొట్టాల్సిందే' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మండల ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ స్పందించారు. సబ్‌ఇంజనీర్ ఆకాశ్, జేఎల్ఎంలు ఉదయ్‌కుమార్, రాజశేఖర్‌లతో కలిసి గ్రామానికి వెళ్లారు. ట్రాన్స్‌పార్మర్‌కు ఉన్న విద్యుత్ ఫీజులు వదులుగా ఉండటంతో చిన్నపాటి మంటలు వస్తున్నాయని గుర్తించారు. దానిని సరి చేసి ప్రమాదం లేకుండా అమర్చి గ్రామానికి సప్లయ్ ఇచ్చారు. ట్రాన్స్‌పార్మర్ చుట్టూ ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

సంక్షిప్త వార్తలు

సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే చొరవ చూపాలి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయని, సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్ చొరవచూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచి పది నెలలు కావస్తున్నా క్యాతనపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. శ్మశానవాటిక లేక అన్ని మతాల వారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మిట్టపెల్లి పౌల్, నక్క వెంకటస్వామి, కమలమ్మ, వనం సత్యం, మొండి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని పద్మనగర్ కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు అన్నారు. సీపీఎం వార్డుల పర్యటనలో భాగంగా శుక్రవారం పద్మనగర్ కాలనీలో పర్యటించారు. మురికి కాలువలను పరిశీలించారు. ఉమారాణి, యామిని, రమాదేవిలు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

మండమర్రిరూరల్: ప్రతి ఒక్కరూ పౌర హక్కులు, రాజ్యాంగంలోని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పొన్నారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశంలోని ప్రతీ పౌరుడికి సమానంగా హక్కులుంటాయని అవగాహన కల్పించారు. రామకృష్ణాపూర్ ఏఎస్సై వెంకన్న, ఆర్ఐ గణపతిరాథోడ్, పంచాయతీ సెక్రెటరీ హరీశ్ తదితరులు ఉన్నారు.

2న కలెక్టరేట్ ఎదుట ధర్నా

శ్రీరాంపూర్: అధిక ధరలు నియంత్రించాలని, సింగరేణిలో ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, 17వవార్డు కౌన్సిలర్ మేకల దాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు, 17వ వార్డులోని హిమ్మత్‌నగర్, ఆర్కే 8 కాలనీలోని భగత్‌సింగ్‌నగర్, సుందరయ్య నగర్, కృష్ణాకాలనీలోని కొన్ని ప్రాంతాల్లో జీవో 76 కింద సింగరేణి ఇళ్ల పట్టాలు రాలేదన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి పూజారి రామన్న, సహాయ కార్యదర్శి మహేశ్, మొగిలి, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

'రాయమల్లు సేవలు మరువలేనివి'

రామకృష్ణాపూర్: ఎన్నో ఏళ్లుగా ఏఐటీయూసీలో క్రియాశీలకంగా పనిచేసిన గాజుల రాయమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడం యూనియన్‌కు, సీపీఐ పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్‌లు అన్నారు. పట్టణంలోని కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం గాజుల రాయమల్లు సంతాప సభ నిర్వహించారు. రాయమల్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

బెల్లంపల్లిరూరల్(తాండూర్): ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని తాండూర్ ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేచిని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రమీలరాణి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీలరాణి దంపతులను ఘనంగా సన్మానించారు. మండల నోడల్ అధికారి మల్లేశం, ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్, జయప్రద, ఉపాధ్యాయులు సతీశ్ కుమార్, రవి, మంజుల, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణ, సంతోష్, నాగమణి, సావిత్రి, శ్రీలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

పాతమంచిర్యాల: రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బీసీ రిజర్వేషన్‌ల కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన బీసీ సంఘాల నాయకులు బత్తుల సిద్దేశ్వర్, జక్కని సంజయ్, కుమార్ గాడ్గెలకు బీసీ సంఘాల జేఏసీ నాయకులు సంఘీభావం, మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం వెంటనే బీసీ కులగణన చేపట్టాలన్నారు. బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మనోహర్, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కొండయ్య, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రాజేశం, బీసీ సబ్‌ప్లాన్ సాధన సమితి జిల్లా కన్వీనర్ రామదాసు, యూత్ నాయకులు చంద్రకాంత్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు అఖిల్, ఒదేలు, పద్మశాలి సంఘం నాయకులు నాగరాజు, మల్లేశం, రాజయ్య, సోమన్న, రాజేందర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. హామీలు నెరవేర్చకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేశ్, పట్టణ కార్యదర్శి రమేశ్, సతీశ్ పాల్గొన్నారు.

పొలాల అమావాస్యకు సెలవులు ఇవ్వాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: పొలాల అమావాస్యకు ఉద్యోగులు, విద్యార్థులకు మూడు రోజులు సెలవులు ఇవ్వాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పొలాల అమావాస్యను అత్యంత భక్తి శ్రద్ధలతో 5రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. నేతకాని మహర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజమల్లు, నాయకులు యువరాజ్, అనూష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఆర్థికసాయం

మందమర్రిరూరల్: హైదరాబాద్‌లోని సోచ్ ఆర్గనైజేషన్ అంధ విద్యార్థులకు పట్టణంలోని కార్మెల్ హైస్కూల్ అధ్యాపక సిబ్బందితో పాటు పలువురు విద్యార్థులు సేకరించిన రూ.35 వేల నగదును శుక్రవారం హైస్కూల్ హెచ్ఎం ఫాదర్ జీవీయర్ రెక్స్ చేతుల మీదుగా అందించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పాతమంచిర్యాల: లయన్స్ క్లబ్ గర్మిళ్ల శాఖ, హెల్పింగ్ హ్యాండ్స్, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 43 మందికి రేకుర్తి కంటి ఆస్పత్రిలో కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు శుక్రవారం మంచిర్యాలకు చేరుకున్న సందర్భంగా నాయకులు పండ్లు పంపిణీ చేసి వారిని గమ్యస్థానాలకు చేర్చారు. రాష్ట్ర ఆటో ప్రణాళిక సంఘం చైర్మన్ ముఖేష్‌గౌడ్, నాయకులు మురళి, రహీం, మధుకర్, షఫి, శేఖర్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 11, 16, 27 తేదీలలో నిర్వహించే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన, 11వ తేదీన వినతిపత్రాలు, 16వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన, 27న చలో సచివాలయం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నారాయణ, వరాలు, నర్సయ్య, చంద్రయ్య, రాజన్న, శంకరయ్య, సాగర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

- అధికారులకు సభ్యుల సూచన
- ముగిసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అర్చనగిల్డా

చెన్నూర్: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ అర్చనగిల్డా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ మాట్లాడుతూ చెన్నూర్ ఆసుపత్రి పరిధిలో నాలుగు డెంగీ కేసులు నమోదుకాగా రెండు కేసులు చెన్నూర్ మున్సిపాలిటీలోనే నమోదయ్యాయని, వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో వార్డులలో మరమ్మతు పనుల కోసం రూ.30వేల చొప్పున కేటాయించారని, 8 వార్డు పనులకు సంబంధించిన బిల్లులు ఏఈ ఎందుకు చేయడం లేదని కౌన్సిలర్ జోడు శంకర్ కమిషనర్ గంగాధర్‌ను ప్రశ్నించారు. ఏఈ సెలవుపై ఉన్నారని, వచ్చిన వెంటనే బిల్లు చేయిస్తానని కమిషనర్ సమాధానం చెప్పారు. పారిశుధ్య నిర్వహణ కుంటుపడకుండా రిపేర్‌లోని స్వచ్ఛ ఆటోలను వెంటనే తెప్పించాలన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చాలని కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. మున్సిపల్ ఆదాయం కంటే పని చేసే సిబ్బంది ఎక్కువగా ఉన్నారని, సిబ్బంది విషయంలో పునరాలోచన చేయాలని అధికారులను కౌన్సిలర్ పోగుల సతీశ్ కోరారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం రూ.లక్ష నిధులు కేటాయించామన్నారు. దోమల నివారణకు సైతం నిధులు కేటాయించామని పేర్కొన్నారు. మున్సిపాలిటీకి మూడు వాటర్ ట్యాంక్‌లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. వైస్‌చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల వివరాలు ధ్రువీకరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న జి.కల్పన

బెల్లంపల్లిరూరల్: అర్హత ఉండి రూ. 2 లక్షలు రుణమాఫీ కాని రైతులు తమ కుటుంబ సభ్యుల వివరాలను ధ్రువీకరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.కల్పన అన్నారు. శుక్రవారం మండలంలోని ఆకెనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కుటుంబ సభ్యుల వివరాల ధృవీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తమ కుటుంబసభ్యుల వివరాలు పొందుపర్చిన దరఖాస్తులను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్, ఏఈవో శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి



బెల్లంపల్లిరూరల్(తాండూర్): సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

బెల్లంపల్లిరూరల్(తాండూర్)/దండేపల్లి/ కోటపల్లి/ చెన్నూర్‌రూరల్/వేమనపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయా మండలాల్లో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తాండూర్‌లో మాజీ ఎమ్మెల్యే, మండల ఇన్‌చార్జి అమురాజుల శ్రీదేవి, మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, దండేపల్లిలో బీజేపీ మండల ఇన్‌చార్జి గుండ ప్రభాకర్, కోటపల్లిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, చెన్నూర్‌రూరల్ మండలంలోని అంగ్రాజ్‌పల్లిలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, వేమనపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

చెన్నూర్‌లో కమిటీ ఎన్నిక

చెన్నూర్: పట్టణ బీజేపీ కమిటీని జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆదేశాల మేరకు నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి తెలిపారు. పట్టణ ఉపాధ్యక్షులుగా మానికరౌతు శంకర్, కాయిత రాజేశ్, పిల్లలమర్రి రాజబాపు, తుంగపిండి రాజేశ్, కార్యదర్శులుగా బొజ్జ పోచన్న, దాసరి రాజన్న, కొత్తూరి ప్రసాద్, గణేశ్‌సింగ్, కోశాధికారిగా కాసుల సుధీర్‌లకు నియామక పత్రాలు అందజేశారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

జైపూర్: విద్యార్థులకు గుణాత్మకమైన విద్య బోధించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాన్ని, జైపూర్ గ్రామ పంచాయతీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతుల నిర్వహణ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. భోజనశాలలో విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. వంట గది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామపంచాయతీని సందర్శించి నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజా పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎలక్టోరల్ రోల్స్ ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలించి, తప్పులు లేకుండా ఓటర్ లిస్టులు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. ఎంపీవో శ్రీపతిబాపురావు, ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, పంచాయ తీకార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

మంచిర్యాలఅర్బన్: యూడైస్ 2024 –25కు సంబంధించి పాఠశాల వివరాలు ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. శుక్రవారం జూమ్‌మీటింగ్ ద్వారా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాల, కళాశాలల ప్రధానోపాధ్యాయులకు క్లస్టర్‌స్థాయి అవగాహన కల్పించారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఏఎస్సీ రాజ్ కుమార్, ఏపీవో రాములు పాల్గొన్నారు.

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూడైస్ ప్లస్‌పై శుక్రవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. యూడైస్ ప్లస్ డీసీఎఫ్‌లో ఎలాంటి తప్పులు లేకుండా నింపాలని, పాఠశాలల మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు, పాఠశాలల నిధుల సమగ్ర సమాచారం ఉంటుందన్నారు.

ఆలయంలో పూజలు



మందమర్రిరూరల్: పట్టణంలోని అంగడిబజార్‌లో గల సంతోషిమాత ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అర్చన చేశారు. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

పండ్ల తోటలు పెంచాలి

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పండ్ల తోటల పెంపకం కోసం లబ్ధిదారులను గుర్తించి, పనులు ప్రారంభించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వనమహోత్సవం కింద నాటిన మొక్కల సంరక్షణ చర్యలు తీసుకోవాలని, కొత్త నర్సరీల కోసం స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కోటపల్లి: మండలంలోని సిర్సా గ్రామం ఏతం రాజయ్యకు చెందిన ఎడ్లు హఠాన్మరణం చెంది జీవనాధారం కోల్పోవడంతో గ్రామస్తులు స్పందించారు. రైతు రాజయ్య కుటుంబానికి రూ.49వేల ఆర్థికసాయం అందజేశారు. దాతలు ఆదుకోవాలని కోరారు.